# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# ధరణి జోలికొస్తే కాంగ్రెస్‌కు పాతరే..

## ఆ పార్టీ నాయకుల ఆలోచనపై మండిపడుతున్న రైతాంగం

## పటేల్, పట్వారీ వ్యవస్థ వద్దంటున్న అన్నదాత

ముఖ్యమంత్రి కేసీఆర్ పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రైతుల భూములకు రక్షణ కల్పిస్తున్నది. దీంతో అన్నదాతలు నిశ్చింతగా ఉన్నారు. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేసి, పాత విధానాన్ని తీసుకొస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధరణి పోతే మా భూములకు రక్షణ ఉండదని, వివరాలు తారుమారవుతాయని ఆందోళన చెందుతున్నారు. కౌలుదారు కాలమ్ గొడవలకు దారి తీస్తుందని మండిపడుతున్నారు. అవినీతికి ఆస్కారముండే పటేల్, పట్వారీ వ్యవస్థ మాకొద్దని తెగేసి చెప్తున్నారు. ధరణి పోర్టల్ జోలికొస్తే కాంగ్రెస్‌కు పాతరేస్తామని హెచ్చరిస్తున్నారు.

### కౌలుచట్టం వస్తే ఊళ్లల్లో నిత్యం గొడవలే



కౌలుదారుల చట్టం తెస్తే ఊళ్లలో మళ్లీ గొడవలు మొదలవుతై. కౌలు అనుభవ దారుల కాలమ్ పెడితే భూమి నాదంటె.. నాదని కోర్టులకెక్కుతరు. వేరే పనుల మీద పట్నాల్లో ఉండే కొంత మంది తమ భూములు కౌలుకు ఇస్తున్నరు. ఈ చట్టం వస్తే ఆళ్లు గిట్ల కౌలుకు ఇయ్యరు. దాంతో చిన్న రైతులు ఇబ్బందులు పడ్తరు. కాంగ్రెసోళ్ల పనే గిది. ఇప్పుడున్న ధరణితో అంతా ప్రశాంతంగా ఉంది. భూమి ఎవరితో ఆన్‌లైన్‌లో నమోదై ఉంటుండడంతో ఏ గొడవలు లేవు. ధరణి పోర్టలే మంచిగున్నది. పాత విధానం అంటే మళ్లా దళారులే వస్తరు. భూములన్నీ ఆగమాగమవుతై. దళారుల రాజ్యం మాకొద్దు. అందుకే మళ్లీ సీఎంగా కేసీఆర్ సారే రావాలి.

**–చింత నగేశ్, వెంకటేశ్వర్లబావి, నార్కట్‌పల్లి మండలం**

### భూ యజమానులకు నష్టం జరుగుతుంది



కాంగ్రెస్ పార్టీ వాళ్లు చెప్పే కౌలుదారు చట్టంతో రైతులకు నష్టం జరుగుతుంది. రైతులు, కౌలుదార్ల మధ్య ఒప్పందంపై ప్రస్తుతం పొలాలను సాగుకు ఇస్తున్నాం. వాళ్లకు అగ్రిమెంట్ రాసిస్తే తేడాలు వస్తే కోర్టువరకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇలాంటి నిర్ణయాలతో రేపటి రోజున పొలాన్ని కౌలువుకు ఇవ్వాలంటే ఎవరూ ముందుకు రారు. కౌలు రైతులకు పనికూడా దొరకని పరిస్థితి ఉంటుంది. పొలాన్ని ఉత్తగా ఉంచుకుంటారు కానీ కౌలుకు ఇవ్వరు. దాంతో సాగు దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. గ్రామాల్లో వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రకటనలు వ్యవసాయాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి.

**– డేగల గోపాల్‌రావు, ఇర్కిగూడెం, దామరచర్ల మండలం**

### రైతులను ఇబ్బంది పెట్టేందుకే కాంగ్రెస్ కుట్ర



ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో మంచిగ నీళ్లు పెట్టుకొని పంటలు సాగు చేసుకుంటున్నం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పగలు మూడు, రాత్రి మూడు గంటల కరెంట్ ఇచ్చేది. కరెంట్ కోసం మధ్య రేత్రి బావుల కాడికి వెళ్లి పడిగాపులు కాసేది. పాములు, తేళ్లకు భయపడుతూ నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపాం. తెలంగాణ వచ్చినంక హాయిగా ఉంటుంటే.. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు మళ్లీ మూడు గంటల కరెంట్ చాలంటున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నరు. మేము వేసుకున్న బోర్లలో ఆ మోటర్లు పట్టవు. పైగా 10 హెచ్‌పీ మోటరు కొనాలంటే లక్ష రూపాయల వరకు ఖర్చవుతుంది. ఆ డబ్బులు కాంగ్రెస్ వాళ్లు ఇస్తరా..? ఇట్లాంటివన్నీ రైతులను ఇబ్బందులు పెట్టేవే తప్ప వేరొకటి కాదు. మాకోసం పని చేసే ప్రభుత్వానికే మద్దతిస్తాం.

**–పాదూరి నర్సిరెడ్డి, రైతు, మొల్కపట్నం, వేములపల్లి మండలం**

### ధరణి తీసేస్తే దళారుల పెత్తనం



తెలంగాణలో ధరణి వచ్చినంక మా భూమిని మార్చడం ఎవని తరం కాదు. అలాంటి చట్టాన్ని తీసేస్తే మళ్లీ దళారుల పెత్తనం షురూ అవుతది. నాకు చందుపట్లలో 5 ఎకరాల పొలం ఉంది. 30 ఏండ్ల నుంచి వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నం. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణితో మా భూములు పక్కాగ ఉండి రైతుబంధు డబ్బులు సక్కగ మా ఖాతాలో పడుతున్నయ్. ఇప్పుడేమో కాంగ్రెస్ వాళ్లు అసలు ధరణి తీసేస్తమంటున్నరు. గట్లయితే రైతుబంధు డబ్బులు ఎట్లా ఇస్తరు. భూములు ఒకరివి మరొకరు గుంజుకుంటరు. ఆ దళారుల రాజ్యం మాకొద్దు. రాబోయే ఎన్నికల్లో రైతుల కోసం పని చేసే బీఆర్ఎస్ ప్రభుత్వానికే మద్దతు తెలుపుతం.

**పుట్ట వెంకన్న, రైతు, చందుపట్ల, నకిరేకల్**

### గతంలో ఏపని కావాలన్నా నెలల తరబడి తిరిగేది



గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఇలా ఏ పని కావాలన్నా నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగే వాళ్లం. రిజిస్ట్రేషన్ అయిన తరువాత బుక్కులు రావడానికి నాలుగు నెలలు పట్టేది. పైరవీలు, దళారులకు డబ్బులు ఇచ్చినా పని అయ్యేది కాదు. భూమి ఒకరిదైతే వేరే వాళ్ల మీద పేరు బుక్కులు రావడం, మన భూమి తక్కువగా చూపడం ఇలా ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడేది. తెలంగాణ ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో మా బాధలు తప్పినై. తాసీల్దార్ కార్యాలయంలోనే స్లాట్ బుక్ చేసుకున్న తెల్లారే రిజిస్ట్రేషన్ సులువుగా అవుతున్నది. భూముల లెక్కలు పక్కాగా ఉంటున్నయ్. ధరణి పోర్టల్ రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నది. అలాంటి ధరణిని కాంగ్రెసోళ్లు తొలగిస్తామనడం సరికాదు. ధరణి తీసేస్తే మళ్లీ పాత రోజులే వస్తయి. దళారులు, పైరవీకారుల రాజ్యం వస్తది. అందుకే ఈసారి రైతుల ఓటు సీఎం కేసీఆర్‌కే.

**–పుట్ట శంకర్, రైతు, కుక్కడం, మాడ్గులపల్లి**

విద్యుత్ కోతలు.. నాలుగైదు గంటల కరెంటు సరఫరా.. రాత్రివేళ ల్లో పొలాల వద్ద పడిగాపులు.. మోటరు వేసేందుకు వెళ్తే పాము, తేలుకాటుకు మృత్యువాత.. కరెంట్ కోసం ఆందోళనలు, కాల్పులు, మరణాలు.. ఇవీ కాంగ్రెస్ పాలనలో దుస్థితి. వీటన్నింటినీ రూపుమాపి సీఎం కేసీఆర్ స్వరాష్ట్రంలో వెలుగులు నింపారు. ఇది ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ రైతులపై కక్ష పెంచుకున్నది. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలంటూ అన్నదాతకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నది. నిరంతర కరెంట్ అసవరం లేదని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నది. ఇన్ని డ్రామాలు ఆడుతున్న హస్తం పార్టీ.. అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కారు చీకట్లేనని, మళ్లీ పాత రోజులు పునరావృతం అవుతాయని భగ్గుమంటున్నారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్‌ను ఆదిలోనే బొంద పెడుతామని, ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని చెప్తునారు.



# కాంగ్రెస్‌ను నమ్మితే కటిక చీకట్లే..

## రైతుల బతుకును అంధకారం చేసే కుట్రలను తిప్పికొడుతాం

### కాంగ్రెసోళ్ల మాటింటే ఎనకటి పరిస్థితి వస్తది



సమైక్య రాష్ట్రంలో కరెంట్ కోసం ఎన్నో తిప్పలు పడ్డం. కరెంట్ ఎప్పుడు వస్తదో తెల్వక రేయింబవళ్లు మోటార్ల వద్దనే కాపలా కాసేవాళ్లం. రాత్రిపూట అక్కడే జాగారం చేసేటోళ్లం. సరిగా నీళ్లు పారక సగం పంట ఎండిపోయేది. తిండి గింజలు సైతం సరిపడా పండేవి కావు. తెచ్చిన అప్పులు తీరక నానా అవస్థలు పడ్డం. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ 24గంటల కరెంట్ ఇస్తుండడంతో ఆ బాధలు తప్పినై. మాకు అవసరమైనప్పుడు మోటరు పెట్టి నీళ్లు పారించుకుంటున్నం. పంటలు బాగా పండుతున్నయ్. ఇప్పుడు రేవంత్‌రెడ్డి 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే 3గంటల కరెంట్ చాలంటున్నడు. మేము ఇప్పటి వరకు 5 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం చేస్తున్నం. 10 హెచ్‌పీ మోటర్లు ఎట్లుంటయో సూడలే. అంత పెద్ద మోటరు అసలు అవసరమే లేదు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మితే మళ్లీ మునుపటి రోజులు వస్తయ్. కాంగ్రెస్ పాలనలో రైతుల గురించి పట్టించుకునే వారు లేకుండా పోయిరి. సీఎం కేసీఆర్ కరెంట్, పంట పెట్టుబడి ఇస్తుండడంతో మేమంతా సంతోషంగా ఉన్నం. కాంగ్రెసోళ్ల పాలన ఎట్లుంటదో మాకు తెలుసు. ఆ బాధలు మాకొద్దు. మళ్లీ సీఎం కేసీఆర్‌నే గెలిపించుకుంటం.

**– మాదాసు సత్తయ్య, కొర్లపహాడ్(గ్రా), కేతేపల్లి(మం)**

### తినే అన్నంలో మన్ను పోసుకున్నట్లే



మాది మాదారం కలాన్ గ్రామం. నాకు మా ఊళ్లో పదెకరాల భూమి ఉంది. వరితో పాటు పత్తి పంటను సాగు చేస్తున్నా. గతంలో మా రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉండె. కరెంట్ కోసం పడరాని పాట్లు పడ్డం. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే రెండు, 3గంటల కరెంట్ కోసం రాత్రిపూట బావుల కాడికి పోయి పండేటోళ్లం. ఎకరం సైతం పారక పోయేది. మాకండ్ల ముందే పంటలు ఎండిపోయేవి. అలాంటి బాధలు ఇంకా కళ్లముందే ఉన్నాయి. తెలంగాణ వచ్చాక మా రైతుల బతుకులు బాగు పడ్డయి. 24గంటల ఫ్రీ కరెంట్ వస్తుంది. మాకు నచ్చినప్పుడు మోటర్ పెట్టుకుంటున్నం. ఇంత మంచిగా ఉన్న టైంలో కాంగ్రెస్ పార్టీ ఎవుసానికి 3గంటల కరెంట్ ఇస్తాం 10హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలంటుంది. ఆ 3గంటల కరెంట్ వద్దు.. అంత పెద్ద మోటార్ వద్దు. వారి మాటలు వింటే తినే అన్నంలో మన్ను పోసుకున్నట్లే. మేము కారు గుర్తుకే ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతం.

**– చింతల సైదులు, మాదారం కలాన్(గ్రా), శాలిగౌరారం(మం)**

### రైతులను మభ్యపెడుతున్నరు



కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రైతులను మభ్య పెడుతున్నరు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకున్నదే లేదు. ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప వ్యవసాయం బాగుకు ఏ ఒక్క పథకం అమలు చేయలె. విత్తనాలు, ఎరువులు మొదలు కొని పంటలు అమ్మడానికి రైతులు అరిగోస పడ్డరు. సమస్యలు పరిష్కరించాలని కోరినా నాడు లీడర్లు పట్టించుకున్నదే లేదు. పదేళ్లుగా రైతుల మేలు కోరే ప్రభుత్వం ఉన్నది. సీఎం కేసీఆర్ వల్ల రైతులు సంతోషంగా బతుకుతున్నరు. ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో 3హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్ల కింద పంటలు సాగు చేస్తున్నరు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లు 3గంటల కరెంట్‌కు.. 10హెచ్‌పీ మోటర్ వాడకం సరికాదు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఎవుసం గురించి అసలు తెల్వదనుకుంటున్న. రైతుల బాధలు తెలిసిన బీఆర్ఎస్‌కే అండగా ఉంటాం.

**– మామిడి శంకర్, పల్లిపహాడ్(గ్రా), గుర్రంపోడ్(మం)**



### 3గంటల కరెంటంటే మళ్లీ మృత్యుఘోషే

కాంగ్రెస్ చెబుతున్న 3గంటల కరెంటంటే మళ్లీ రైతుల మృత్యుఘోషే. గతంలో 9గంటల కరెంట్ ఉన్నప్పుడే ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక రైతులు రాత్రి వేళ వ్యవసాయ బావుల కాడ పడుకుని ప్రమాదాలకు గురయ్యేవారు. ప్రస్తుతం మళ్లీ 3గంటలంటే అంతకంటే దారుణంగా ఉంటుంది. ఆ 3గంటలు ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు రోజంతా బావుల కాడనే ఉండాలి. కరెంట్ వచ్చినపుడు అందరూ ఒకేసారి మోటర్లు వేస్తే ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు పడి ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోతాయి. దీంతో ఉన్న పొలాలు ఎండిపోతాయి. కరెంటోళ్ల కాడికి, మోటర్ల వైడింగ్ షాపుల కాడికి తిరగలేక రైతులు సచ్చిపోతరు. ఇప్పుడు ఇస్తున్న 24 గంటల కరెంటుతో మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. వీలున్నప్పుడు బాయి కాడికి పోయి మోటర్ వేసుకుని పొలం పారిచ్చుకుంటున్నాము. 3గంటల కరెంటైతే చాలా ఇబ్బందవుతుంది. సీఎం కేసీఆర్ సార్ వల్ల ప్రస్తుతం ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుంటున్నం. మళ్లీ సారే రావాలి.

**– యాకారి రమేశ్, సుంకెనపల్లి, చిట్యాల**

### నాడు కరెంట్ లేక ఇబ్బంది పడ్డం



గత ప్రభుత్వాల కాలంలో వ్యవసాయానికి కరెంటు సరిగా రాక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. రాత్రి సమయంలో కరెంట్‌కు నిద్ర కాచి కాపాల ఉండేవాళ్లం. వచ్చే కరెంట్ సైతం ఎంతసేపు ఉంటదో తెలియదు. మళ్లీపోతే మళ్లీ పెట్టాల్సిందే. ఇచ్చిన ఐదారు గంటలు సైతం విడుతల వారీగా ఇచ్చేది. దీంతో పారిన మడి మళ్లీ పారేది. పంట చేతికొచ్చేసరికి నానా ఇబ్బందులు పడేవాళ్లం. చివరి మడులు ఎండిపోయేది. సీఎం కేసీఆర్ వచ్చాక భూగర్భ జలాల పెంపునకు కృషి చేయడంతో పాటు, కరెంటు సరిపడా ఇవ్వడంతో మేము మోటర్ల వద్ద పోవాల్సిన పరిస్థితి లేదు. ఆటోమెటిక్ బిగిస్తే అదే పారుతుంది. కరెంట్ నాణ్యతగా ఉంటుంది. దీంతో మోటర్లు కాలడంలేదు. మనకు ఎంత పొలం పారించుకున్న అంత పొలం పారుతుంది. గతంలో నాలుగెకరాలు ఉంటే రెండెకరాలే నాటు పెట్టేది. ప్రస్తుతం నాలుగు ఎకరాలకు నాలుగెకరాల సాగు చేస్తున్నాం. రేవంత్‌రెడ్డి చెబుతున్నట్లు 3గంటలు.. 10హెచ్‌పీ మోటర్ అంటే ఇబ్బందులు తప్పవు. 10హెచ్‌పీ మోటర్‌కే లక్ష రూపాయలు ఖర్చవుతుంది. భూమిలోని నీరంతా మోటర్ ఒకేసారి గుంజడంతో ఇబ్బందులు ఏర్పడుతాయి. కరెంట్ ఇప్పుడు ఉన్నట్లుగానే ఉండాలే. సీఎం కేసీఆర్ పాలన బాగుంది.

**– చల్లభట్ల మల్లారెడ్డి, సిలార్మియగూడెం(గ్రా), తిప్పర్తి(మం)**



### ఉచిత కరెంట్‌ను ఎత్తివేసే కుట్ర

కరెంట్ 3గంటలని ఒకరు, 5గంటలని మరొకరు.. ఇంకొకరు 10హెచీపీ మోటర్ పెట్టుకోవాలని అంటురు. ఎవర్ని నమ్మాలి. కాంగ్రెసోళ్లు పూటకోమాట మాట్లాడి మమ్ముల్ని ఆగంజేస్తున్నరు. వారు ఎప్పుడన్నా వ్యవసాయం చేసిన ముఖమేనా? ఎందుకిట్ల మాట్లాడుతున్నరు. అటు ఇటు చేసి ఉచిత కరెంట్ ఎత్తేయాలని పెద్ద ప్లాన్ వేస్తున్నరు. కాంగ్రెసోళ్ల పాలనలో పడ్డా కరెంట్ కష్టాలు చాలు వాటిని ఇంకా మరిచిపోలేదు. రాత్రిపూట కరెంట్ కోసం మా తాత, మానాన్న పోయిటోళ్లు. వాళ్లు ఎంత ఇబ్బందిపడ్డోరో మాకు తెలుసు. కరెంట్ సరిగా లేక వ్యవసాయం చేయలేక మా గ్రామాల నుంచి రైతులు ఇతర ప్రాంతాలకు వలస పోయేవాళ్లు. రైతుల జీవితాలు ఆగమైనయి. మళ్లీ ఇప్పుడిప్పుడే సీఎం కేసీఆర్ పాలనలో రైతులు మంచిగా బతుకుతున్నారు. 24గంటల కరెంట్‌తో బాధలు లేకుండా రెండు పంటలు పండించుకుంటున్నం. ఎవనితో ఏమి కాదు కాంగ్రెసోళ్లు, బీజేపీ వాళ్లు వచ్చేది లేదు, సచ్చేది లేదు. కాంగ్రెసోడు కరెంట్ వద్దంటే.. బీజేపీ వాళ్లు మోటర్లకు మీటర్లు పెడుతా అంటుండు. రైతు తెరువు వస్తే మేము ఆ పార్టీలకు ఓట్లతో తగిన బుద్ధి చెబుతం. రైతుల బాధలు సీఎం కేసీఆర్ సారుకే అండగా ఉంటాం.

**– ఉప్పునూతల శ్రీశైలం, లక్ష్మీదేవిగూడెం, మునుగోడు(మం)**



### కాంగ్రెస్‌కు ఓటేస్తే కంచంలో అన్నం నేల పాల్జేసుకున్నట్టే..

కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కంచంలో ఉన్న అన్నం నేలపాల్జేసుకున్నట్లే. గతంలో కరెంట్ లేక, పొలాలు పండక రైతులు హైదరాబాద్ పోయి కూలీ పనులు చేసుకుని దీన స్థితిలో బతికేవారు. ఇచ్చే మూడు గంటల కరెంట్ సరిపోక అది సక్రమంగా రాక మోటార్ల కాడ కావలి పండేవారు. మోటార్లు కాలిపోయి నానా అవస్థలు, ఇబ్బందులు పడ్డ రైతులు ప్రస్తుతం సరిపడా కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని వదులుకోరు. గతంలో కనీసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కావాలన్నా సంవత్సరాలు పట్టేది. ప్రస్తుతం డీడీ కట్టిన ఐదు రోజుల్లోనే స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ మన పొలంలో ఫిట్ చేస్తున్నరు. కరెంట్ అందించని కాంగ్రెస్‌కు ఓటు వేసి మనం తినే అన్నాన్ని కింద పోగొట్టుకున్నట్లే. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ వెలుగులు దీపం బుడ్డిలా కనపడేది. ప్రస్తుతం సీఎం కేసీఆర్ సార్ ఎల్ఈడీ లైట్లతో గ్రామాల్లో విద్యుత్ కాంతులు అందిస్తున్నరు. 10హెచ్‌పీ మోటార్ వేసి నీళ్లు గుంజాలంటున్న రేవంత్‌రెడ్డి ఒక రోజు పొలంలోకి పోయి వ్యవసాయం చేస్తే కష్టం విలువ, ప్రాణం విలువ తెలుస్తది. కాంగ్రెస్‌ను తరిమి కొట్టడానికి రైతులంతా ఓటు రూపంలో సిద్ధంగా ఉన్నరు. మాయమాటలకు మోసపోకుండా ప్రజలంతా బీఆర్ఎస్ ప్రభుత్వానికే ఓటు వేయాలని నిర్ణయించుకున్నరు.

**– చింతకాయల యాదయ్య, త్రిపురారం**